సాక్షి
హనుమకొండ
బుధవారం । 20 । సెప్టెంబర్ । 2023



చట్టసభల్లో రిజర్వేషన్లు కల్పించాలి

బీసీలకు చట్టసభల్లో రిజర్వేషన్లు కల్పించాలని బీసీ రాజ్యాధికార సమితి అధ్యక్షుడు దాసు నరేష్ డిమాండ్ చేశారు.

- 8లో▸



కేయూకు ముగిసిన సెలవులు

కేయూకు ఈ నెల 18వ తేదీతో సెలవులు ముగిశాయి. మంగళవారం నుంచి తరగతులు ప్రారంభమయ్యాయి.

- 8లో▸



వాతావరణం

జిల్లాలో ఉదయం ఆకాశం మేఘావృతమై ఉంటుంది. మధ్యాహ్నం తర్వాత చిరు జల్లులు కురిసే అవకాశం ఉంది. సాయంత్రం ఆహ్లాదకరంగా ఉంటుంది.

డాల్ఫిన్ హోటల్ వీధిలో త్రివర్ణ దూది రాఖీలతో గణపతి, ఖగోళంలో చంద్రయాన్ -3 గణేశుడు





బైక్‌పై వెళ్తున్న వాహనదారుడిని ఆపుతున్న ట్రాఫిక్ పోలీస్ వేషంలో ఉన్న ఎలుక, హెల్మెట్ అందజేస్తున్న వినాయకుడు



విభిన్నం.. వినూత్నం

గణేశ్ నవరాత్రులు ప్రారంభమయ్యాయి. వరంగల్ నగరంలో ఉత్సవ కమిటీలు ఏర్పాటుచేసిన గణేశ్ విగ్రహాలు ఆలోచింపజేస్తున్నాయి. అలాంటిదే హనుమకొండలోని సుధానగర్‌లో నూతన గజానన మండలి ఆధ్వర్యంలో ఏర్పాటు చేశారు. నగరంలో భూకబ్జాలు, హెల్మెట్ ధరించకుండా కుటుంబ సమేతంగా బైక్‌పై వెళ్తున్న ఓ వాహనదారుడిని ట్రాఫిక్ పోలీస్ వేషంలో ఉన్న ఓ ఎలుక ఆపగా, వినాయకుడు హెల్మెట్‌ను అందిస్తూ ప్రాణాలకు భరోసా ఇస్తున్న వినాయకుడి విగ్రహం ఓ వైపు.. ఏర్పాటు చేయగా, అక్రమాలకు పాల్పడుతున్న వారిపై ఉక్కుపాదం మోపుతున్న పోలీస్ కమిషనర్ ఏవీ రంగనాథ్ ప్రజా దర్బార్‌లో బాధితుడి నుంచి ఫిర్యాదు పత్రాన్ని స్వీకరిస్తున్నట్లున్న మరో విగ్రహాన్ని ప్రతిష్ఠించారు. ఒకే మంటపంలో ఉన్న ఈ రెండు విగ్రహాలు భక్తులను ఆలోచింపజేయడం తోపాటు ఆకట్టుకుంటున్నాయి. అదేవిధంగా దాల్చిన చెక్క, డ్రైఫ్రూట్స్, దూది రాఖీలు, చంద్రయాన్-3 మోడల్‌లో ప్రతిష్ఠించారు.

- హన్మకొండ చౌరస్తా/సాక్షి ఫొటోగ్రాఫర్లు హనుమకొండ, వరంగల్



బాధితుడినుంచి ఫిర్యాదు స్వీకరిస్తున్న పోలీస్ కమిషనర్ వేషధారణలోని వినాయకుడు

బీసీని ముఖ్యమంత్రిగా ప్రకటించాలి

సాధన సదస్సులో వక్తలు

హన్మకొండ: జనాభాలో సగభాగానికి పైగా ఉన్న బీసీలకు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో, తెలంగాణ రాష్ట్రంలో ఒక్కసారి కూడా ముఖ్యమంత్రిగా అవకాశం దక్కలేదని, ఈసారైనా కల్పించాలని వక్తలు డిమాండ్ చేశారు. మంగళవారం హనుమకొండ నక్కలగుట్టలోని హరిత కాకతీయ హోటల్‌లో తెలంగాణలో సామాజిక న్యాయం – బీసీ ముఖ్యమంత్రి సాధన సదస్సు జరిగింది. ఈ సదస్సులో ఆయా పార్టీల, సంఘాల నాయకులు పాల్గొన్నారు. ముందుగా తెలంగాణలో సామాజిక న్యాయం – బీసీ ముఖ్యమంత్రి సాధన సమితి చైర్మన్ ప్రొఫెసర్ డాక్టర్ గాలి వినోద్ కుమార్ మాట్లాడుతూ రాజ్యాధికారం ద్వారానే బీసీల సమస్యలు పరిష్కారమవుతాయన్నారు. ఈ దిశగా 2023లో జరిగే తెలంగాణ రాష్ట్ర ఎన్నికల్లో అన్ని పార్టీలు బీసీ ముఖ్యమంత్రి చేయడానికి తమ రాజకీయ ఎజెండాను రూపొందించాలని డిమాండ్ చేశారు. ఏఐసీసీ ఓబీసీ కోఆర్డినేటర్ ప్రొఫెసర్ కత్తి వెంకటస్వామి మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీలో ధనం, కులం రెండింటికీ ప్రాధాన్యత ఉందని, బీసీలకు తగిన ప్రాధాన్యత ఇవ్వడంలో విఫలమైన మాట వాస్తవమేనన్నారు. ఇప్పటికైనా కాంగ్రెస్ పార్టీ మేల్కొని బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ వర్గాలకు, మహిళలకు తగిన ప్రాధాన్యత ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ప్రొఫెసర్ గాలి వినోద్ కుమార్ 53వ పుట్టిన రోజును జరుపుకున్నారు. డిగ్రీ కంప్యూటర్ సైన్స్ చదువుతున్న అను అనే పేద విద్యార్థినికి ల్యాప్‌టాప్ అందించారు. సదస్సులో ఆయా సంఘాలు, పార్టీల ప్రతినిధులు డాక్టర్ కాశీ ప్రసాద్, తాడూరు శ్రీనివాస్, ప్రొఫెసర్ కూరపాటి వెంకటనారాయణ, నల్ల సూర్య ప్రకాష్, డాక్టర్ తిరినహరి శేషు, డాక్టర్ సంకినేని వెంకట్, ప్రొఫెసర్ అన్వర్ ఖాన్, చంద్రకళ, మాస్ సావిత్రి, డాక్టర్ తీగల ప్రేమ్ సుందర్, బైరి రవికృష్ణ గౌడ్, దాసు సురేష్, వీరన్న మెరుగు బాబు యాదవ్, అల్లం నాగరాజు, యాదగిరి గౌడ్, డాక్టర్ జగదీష్ ప్రసాద్, శ్రీనివాస్‌లు తమ అభిప్రాయాలను వ్యక్తం చేశారు.



పేద విద్యార్థిని అనుకు ల్యాప్‌టాప్ బహూకరిస్తున్న ప్రొఫెసర్ గాలి వినోద్ కుమార్, అతిథులు

న్యూస్‌రీల్

దరఖాస్తుల ఆహ్వానం

కాజీపేట అర్బన్: హనుమకొండ జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో విద్యనభ్యసిస్తున్న 1 నుంచి 10వ తరగతి దివ్యాంగ విద్యార్థులకు ప్రీ మెట్రిక్, ఇంటర్ ఆపై చదువుతున్న వారికి పోస్ట్‌మెట్రిక్ స్కాలర్‌షిప్స్‌కు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు జిల్లా స్త్రీ,శిశు సంక్షేమ శాఖ ఇన్‌చార్జ్ మధురిమ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆన్‌లైన్‌లో telangana epass.cgg.gov.in అనే వెబ్‌సైట్‌లో ప్రీ మెట్రిక్ విద్యార్థులు అక్టోబర్ 31వ తేదీలోపు, పోస్ట్‌మెట్రిక్ విద్యార్థులు డిసెంబర్ 31వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. దివ్యాంగ విద్యార్థులు అవకాశాన్ని సద్వినియోగపరచుకోవాలని, వివరాలకు 98487 85278 నంబర్‌లో సంప్రదించాలని కోరారు.

పోలీస్ కుటుంబానికి చెక్కు అందజేత



వరంగల్ క్రైం : ఆకస్మికంగా మరణించిన ఎస్సై కుటుంబానికి పోలీస్ భద్రత నుంచి మంజూరైన చెక్కును సీపీ ఏవీ రంగనాథ్ మంగళవారం అందజేశారు. జనగామ ఎస్సైగా విధులు నిర్వర్తిస్తున్న శ్రీనివాస్ గత జూన్‌లో మరణించాడు. దీంతో తెలంగాణ పోలీస్ భద్రత పథకం ద్వారా అతని కుటుంబానికి మంజూరైన రూ.16 లక్షల చెక్కును సీపీ రంగనాథ్.. ఎస్సై కుమారులు రవితేజ, భార్గవ్‌తేజ్‌లకు అందజేశారు. కుటుంబ స్థితిగతులను సీపీ అడిగి తెలుసుకున్నారు. శాఖాపరంగా రావాల్సిన బెనిఫిట్‌లను అందజేసేందుకు తక్షణమే చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో సెక్షన్ సూపరింటెండెంట్ యుగేందర్, పోలీస్ అధికారుల సంఘం ప్రతినిధి శోభన్ పాల్గొన్నారు.

పాఠశాలల్లో చేరుతున్న హెచ్‌ఎంలు

విద్యారణ్యపురి: పాఠశాల విద్యాశాఖ ఆర్‌జేడీ పరిధిలోని మల్టీజోన్ -1 పరిధిలో హైస్కూళ్లలోని హెచ్‌ఎంల బదిలీ ఉత్తర్వులు వెలువడిన విషయం తెలిసిందే. మల్టీజోన్ 1 పరిధిలో 19 జిల్లాల్లో బదిలీలకు దరఖాస్తులు చేసుకున్న వారిలో లోకల్‌బాడీ పరిధిలో 941మంది హెచ్‌ఎంలు, ప్రభుత్వ యాజమాన్యాల పరిధిలో 59మంది హెచ్‌ఎంలకు బదిలీల ఉత్తర్వులు వెలువడగా ఎక్కువశాతంమంది మంగళవారం తమ హైస్కూళ్ల నుంచి రిలీవ్‌అయి బదిలీ అయిన పాఠశాలల్లో జాయిన్ అయ్యారని సమాచారం. ఇక స్కూల్‌అసిస్టెంట్‌లకు హెచ్‌ఎంలుగా పదోన్నతులు కల్పించాల్సి ఉంటుంది. ఇప్పటికే స్కూల్ అసిస్టెంట్‌లనుంచి హెచ్‌ఎంలుగా పదోన్నతులు పొందాల్సిన వారి సీనియారిటీ లిస్టులను సంబంధిత అధికారులు విడుదల చేశారు.

'ఛాంబర్' ప్లాటినం జూబ్లీ ఉత్సవాలకు రావాలి

వరంగల్: వరంగల్ ఛాంబర్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ 75వసంతాలు పూర్తి చేసుకున్న సందర్భంగా ఈనెల 30వ తేదీన ప్రారంభం కానున్న ప్లాటినం జూబ్లీ ఉత్సవాల్లో పాల్గొనాలని రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్‌శాఖ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డిని ఛాంబర్ అధ్యక్షుడు బొమ్మినేని రవీందర్‌రెడ్డి కోరారు. ఈ మేరకు వారు మంగళవారం హైదరాబాదులో మంత్రిని మర్యాదపూర్వకంగా కలిసి ఆహ్వానించారు. మంత్రిని కలిసినవారిలో ఛాంబర్ మాజీ అధ్యక్షుడు కటకం పెంటయ్య, కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

కేఎంసీని వీడని ర్యాగింగ్ రక్కసి



మెడికల్ కాలేజీలో సీనియర్ల దురుసుప్రవర్తన

- చర్యలు తీసుకుంటున్నా ఆగని ఘటనలు
- ప్రీతి విషయంలో సైఫ్‌పై ఏడాది వేటు
- తాజాగా జూనియర్ విద్యార్థి మనోహర్‌ను వేధించిన సీనియర్లు
- ఏడుగురిపై 3 నెలలపాటు సస్పెన్షన్ వేటు.. ఏడాది పాటు హాస్టల్ నిరాకరణ
- సుదీర్ఘ విచారణ అనంతరం నిర్ణయం తీసుకున్న యాంటీర్యాగింగ్ కమిటీ

ఎంజీఎం: వరంగల్ కాకతీయ మెడికల్ కళాశాలలో ర్యాగింగ్ రక్కసి మళ్లీ విజృంభిస్తోంది. దాదాపు 1,500 మంది వైద్య విద్యార్థులున్న ఈ కళాశాల ర్యాగింగ్ పేరుతో తరచూ వార్తల్లో నిలుస్తోంది. ఘటనలు జరిగిన సందర్భంలో సీనియర్లను పిలిచి మందలించినా.. పరిస్థితుల్లో మార్పు రాకపోవడంతో ఏకంగా కాలేజీ నుంచి ఆర్నెళ్ల పాటు సస్పెండ్ చేసిన ఉదంతాలు ఉన్నాయి. కొందరు విద్యార్థులపై పోలీస్ స్టేషన్‌లో కేసులు నమోదై, అరెస్టయిన సందర్భాలూ ఉన్నాయి. పలుకుబడి కలిగిన విద్యార్థులకు ర్యాగింగ్ వేధింపులు ఎదురైనప్పుడు మాత్రమే వెలుగులోకి వస్తున్నాయని, బ్యాక్ గ్రౌండ్ లేని వారు ఆ బాధలు భరిస్తూ మనకెందుకులే అని సర్దుకొని చదువు సాగిస్తున్నారనే చర్చ కేఎంసీలో వినిపిస్తోంది. ఈ ఏడాది ఫిబ్రవరిలో ప్రీతి అనే జూనియర్ విద్యార్థి మృతికి సైఫ్ అనే సీనియర్ విద్యార్థి ర్యాగింగ్ కారణమైందని యాంటీ ర్యాగింగ్ కమిటీ నిర్ధారించడంతో అతడిపై ఏడాది పాటు సస్పెన్షన్ వేటు పడింది. ఈ నెల 14వ తేదీ రాత్రి జూనియర్ విద్యార్థి మనోహర్‌పై ర్యాగింగ్ ఘటనలో ఏడుగురు విద్యార్థులపై మూడు నెలలపాటు సస్పెన్షన్‌వేటు వేశారు. కేఎంసీ చరిత్రలో ఒకేసారి ఏడుగురిపై సస్పెన్షన్ వేటు పడడం ఇదే మొదటి సారి అని కాలేజీ అధ్యాపకులు చెబుతున్నారు.

గత ర్యాగింగ్ ఘటనలు..

- 2009 ఆగస్టు 6 : అనుమల్ల అచ్యుత కృష్ణ.. కాలేజీలో చేరిన తొలిరోజు ఎనిమిది మంది సీనియర్లు కలిసి ర్యాగింగ్ చేశారు. ఈ విషయమై బాధితుడు కళాశాల ప్రిన్సిపాల్‌కు ఫిర్యాదు చేయగా.. ఎనిమిది మందిపై మట్టెవాడ పోలీసులు కేసు కూడా నమోదు చేశారు.
- 2014, ఫిబ్రవరి 13: ఎంబీబీఎస్ ఫైనలియర్ విద్యార్థులు పృథ్వీరాజ్, అనూష్ యాదవ్‌లు.. ఫస్టియర్ విద్యార్థిని గాజు ముక్కలపై మోకాళ్ల మీద నడవాలంటూ ర్యాగింగ్ చేశారు. ఈఘటనపై ఆ ఇద్దరు విద్యార్థులను ఆర్నెళ్లపాటు సస్పెండ్ చేశారు.
- 2021 సెప్టెంబర్ : కేఎంసీ ప్రాంగణంలోని క్రీడా మైదానంలో ఫస్టియర్ చదువుతున్న విద్యార్థులతో సీనియర్ విద్యార్థుల ఫుట్‌బాల్ మ్యాచ్ సమయంలో గొడవ జరిగింది. ఆ తరువాత జరిగిన ఘర్షణలో రాజస్థాన్‌కు చెందిన ఓ విద్యార్థిని మోకాళ్లపై కూర్చోమనడంతో అతను ఎదురు ప్రశ్నించగా.. బలవంతంగా కూర్చొబెట్టి సిగరెట్ తాగుతూ ముఖంపై ఊదారు. దీనిని శాంతియుత వాతావరణంలో మాట్లాడుకున్నట్లు కేఎంసీ వర్గాల ద్వారా తెలిసింది.
- పీజీ వైద్య విద్య అభ్యసించే విద్యార్థులు సైతం వేధింపులకు గురవుతున్న విషయం ప్రీతి ఘటనతో వెలుగులోకి వచ్చింది. గతేడాది నవంబర్‌లో ప్రీతిని సీనియర్ విద్యార్థి సైఫ్ వేధించడంపై ఎంజీఎం అధికారులు ఇద్దరికి కౌన్సెలింగ్ నిర్వహించిన మరుసటి రోజే ప్రీతి ఆత్మహత్యాయత్నానికి పాల్పడి మృతి చెందింది. ఈ ఘటనలో సైఫ్ జైలు శిక్షను అనుభవించడంతో పాటు అతడిని ఏడాది పాటు సస్పెండ్ చేశారు.

తాజాగా.. మనోహర్ ఘటన

ఈ నెల 14వ తేదీ అర్ధరాత్రి జూనియర్ విద్యార్థి మనోహర్‌పై దాదాపు 15 మంది విద్యార్థులు ర్యాగింగ్ పాల్పడ్డారు. బాధితుడి ఫిర్యాదుతో కళాశాల అంతర్గత కమిటీ 10 మంది ర్యాగింగ్‌కు పాల్పడినట్లు ప్రాథమికంగా నిర్ధారించింది. ఏడుగురిపై మట్టెవాడ పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదు కాగా, మంగళవారం యాంటీ ర్యాగింగ్ కమిటీ సమావేశమై ర్యాగింగ్‌కు పాల్పడిన ఏడుగురిని 3 నెలలపాటు సస్పెండ్ చేసింది. ఏడాదిపాటు హాస్టల్ వసతిని నిరాకరిస్తూ తీర్మానం చేసింది.

రక్షణ చర్యలు పెంచుతాం

కాలేజీలో సెక్యూరిటీ పెంచుతాం. కాలేజీలో అన్ని రాష్ట్రాల విద్యార్థులు ఉన్నారు. గతంలోనూ రాజస్థాన్ విద్యార్థిపై ర్యాగింగ్ జరిగింది. తాజా ఘటనలో బాధితుడు కూడా రాజస్థాన్ విద్యార్థే. వీరిమధ్య స్నేహతత్వం నెలకొనేందుకు త్వరలో నార్త్, సౌత్ ఇండియన్ విద్యార్థులతో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేస్తా. కళాశాలలో మద్యం సేవించడం లాంటి చర్యలపై కఠిన చర్యలు తీసుకుంటాం.

- మోహన్‌దాస్, కేఎంసీ ప్రిన్సిపాల్

భవిష్యత్‌ను నాశనం చేసుకోవద్దు

విద్యాసంస్థల్లో ర్యాగింగ్ చట్ట విరుద్ధం. జూనియర్లను ఇతరత్రా కారణాలతో వేధిస్తే చట్టపరంగా కఠిన చర్యలు ఉంటాయి. ఒకసారి కేసు నమోదు అయితే వారి భవిష్యత్ అంధకారమవుతుంది. క్షణికానందం కోసం ర్యాగింగ్‌లాంటి చర్యలకు పాల్పడి మంచి భవిష్యత్‌ను నాశనం చేసుకోవద్దు. కేఎంసీలో విద్యార్థి మనోహర్‌ను ర్యాగింగ్ చేసిన ఏడుగురిని సస్పెండ్‌చేసినా వారిపై పోలీసుల చట్టపరమైన విచారణ కొనసాగుతుంది.

- బోనాల కిషన్ ఏసీపీ, యాంటీ ర్యాగింగ్ కమిటీ సభ్యుడు

ర్యాగింగ్ నివారణ ఇలా

ప్రత్యేక హాస్టల్‌లో ఫ్రెషర్‌లను బస చేయడం, ప్రత్యేకించి రాత్రుల్లో యాంటీ ర్యాగింగ్ స్క్వాడ్ ఆకస్మిక దాడులు, సీనియర్ విద్యార్థులు, వారి తల్లిదండ్రులు అఫిడవిట్‌లు సమర్పించడం వంటి కఠినమైన ముందస్తు చర్యలు చేపట్టాలి.

- యాంటీ ర్యాగింగ్ సంస్థలు, పోలీస్ వ్యవస్థలతో కాలేజీలో అవగాహన డ్రైవ్‌లు ఏర్పాటు చేయాలి.

ర్యాగింగ్ కింద ఏమేమి వస్తాయంటే..

- సీనియర్లు సూచించిన డ్రెస్‌లనే వేసుకుని రావాలని హుకుం జారీ చేయడం. డ్రెస్‌కోడ్ ర్యాగింగ్ కొత్తవారికి ఇబ్బందికరంగా, అసౌకర్యంగా అనిపించొచ్చు.
- సీనియర్లకు నచ్చిన భాషల్లో తమను తాము పరిచయం చేసుకోవాలని జూనియర్లపై ఒత్తిడి చేయడం.. ఆ పరిచయంలో కొత్తవారి పేరు, చిరునామా, పాఠశాల, మార్కులు, తల్లిదండ్రుల పేర్లు అడగడంలాంటివి.
- అసభ్యకరమైన పాటలు పాడించడం, బట్టలు విప్పించి నృత్యాలు చేయించడం.
- ర్యాగింగ్‌లో తీవ్రమైనది లైంగికవేధింపులు. ఒకరి శరీర భాగాల శరీర నిర్మాణ సంబంధమైన వర్ణన, అతని లేదా ఆమె లైంగిక అభిరుచులు ఏమిటో చెప్పమనడం, దుస్తులు బలవంతంగా విప్పించడంలాంటివి.
- సినిమా వాళ్లను అనుకరించాలని, సన్నివేశం తీరుగా నటించమని చెప్పడం, చెట్టు ఎక్కమనడం, వ్యతిరేక లింగానికి చెందిన వారికి ప్రపోజ్ చేయడం వంటివి.
- గదులను శుభ్రం చేయించడం, దుస్తులు ఉతికించడం, పాలు తీసుకురావడం నుంచి వారి అసైన్‌మెంట్‌లను పూర్తి చేయడం వరకు..
- బలవంతంగా సిగరెట్, మందు తాగించడం, ఇతర డ్రగ్స్‌ను తీసుకోవాలని ఒత్తిడి చేయడం లాంటివి.

'ఆరోగ్య మహిళ'ను సద్వినియోగం చేసుకోవాలి

డీఎంహెచ్‌ఓ డాక్టర్ సాంబశివరావు

కమలాపూర్: ఇంటి యజమానురాలు ఆరోగ్యంగా ఉంటే ఆ కుటుంబం ఆరోగ్యంగా ఉంటుందనే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం నూతనంగా ప్రారంభించిన ఆరోగ్య మహిళ కార్యక్రమాన్ని మహిళలు సద్వినియోగం చేసుకోవాలని డీఎంహెచ్‌ఓ డాక్టర్ సాంబశివరావు సూచించారు. కమలాపూర్ మండలంలోని ఉప్పల్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని మంగళవారం ఆయన ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా ఆస్పత్రిలో ఆరోగ్య మహిళ కార్యక్రమం నిర్వహణ తీరును పరిశీలించి ఏమైనా ఇబ్బందులు ఉన్నాయా అని వైద్యసిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. నిర్వహణపై సంతృప్తి వ్యక్తం చేశారు. కార్యక్రమంలో వైద్యాధికారి డాక్టర్ పద్మశ్రీ, ఆర్‌బీఎస్‌కే విద్యాధికారి డాక్టర్ కవిత, ఆరోగ్య పర్యవేక్షకురాలు కనుకలక్ష్మి, స్టాఫ్ నర్సులు పుష్పలత, సరిత, ల్యాబ్ టెక్నీషియన్ శంభురెడ్డి, ఫార్మసిస్ట్ హేమలత, ఏఎన్‌ఎంలు ఇందిరా ప్రియదర్శిని, మేరీ, రజిత, హెల్త్ అసిస్టెంట్లు ప్రభాకర్, సురేందర్, శివకుమార్, ఆరోగ్య మిత్ర రవీందర్, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.



వైద్య సిబ్బందితో మాట్లాడుతున్న డీఎంహెచ్‌ఓ డాక్టర్ సాంబశివరావు



తహసీల్దార్ కార్యాలయం సందర్శన..

ఎల్కతుర్తి: భీమదేవరపల్లి మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయాన్ని ట్రైనీ ఐఏఎస్ శ్రద్ధా శుక్ల మంగళవారం సందర్శించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ వెంకటభాస్కర్.. కార్యాలయ పనితీరును ఆమెకు వివరించారు. భూముల రిజిస్ట్రేషన్ విధానం, తహసీల్దార్ నిర్వహించే విధులపై ఆమెకు అవగాహన కల్పించారు. అలాగే ఎంపీడీఓ భాస్కర్ మండలంలో జరిగే అభివృద్ధి పనులు, పల్లె ప్రకృతి వనాలు, క్రీడా ప్రాంగణాలు, పంచాయతీ కార్యాలయాల నిర్వహణ పనితీరును శ్రద్ధా శుక్లాకు వివరించారు. స్థానిక ఎస్సై సాయిబాబు 'లా అండ్ ఆర్డర్' విధానంపై క్లుప్తంగా వివరించారు. కార్యక్రమంలో ఎంపీఓ నాగరాజు తదితరులు ఉన్నారు.



భీమదేవరపల్లి తహసీల్దార్ కార్యాలయాన్ని సందర్శించిన ట్రైనీ ఐఏఎస్ శ్రద్ధా శుక్ల

సైకిల్‌ను ఢీకొన్న ఆర్టీసీ బస్సు : వృద్ధుడి మృతి

ఆత్మకూరు: సైకిల్‌పై వెళ్తున్న వృద్ధుడిని ఆర్టీసీ బస్సు ఢీకొట్టడంతో అతను అక్కడికక్కడే మృతిచెందాడు.ఈ ఘటన మండలంలోని గుడెప్పాడ్‌లో మంగళవారం చోటుచేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం.. గుడెప్పాడ్‌కు చెందిన మేక స్వామిరెడ్డి (70) మంగళవారం వ్యవసాయ పనుల నిమిత్తం సైకిల్‌పై గుడెప్పాడ్‌లో రోడ్డు దాటుతుండగా ములుగునుంచి హనుమకొండ వైపు వెళుతున్న ఆర్టీసీ బస్సు ఢీకొట్టింది. స్వామిరెడ్డి తీవ్రగాయాలపాలై అక్కడికక్కడే చనిపోయాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం వరంగల్ ఎంజీఎంకు తరలించారు. మృతుడి భార్య సౌందరమ్మ ఫిర్యాదు మేరకు ఆత్మకూరు సీఐ రవిరాజు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

ఆరు గ్యారంటీ స్కీమ్‌లు పక్కాగా అమలు



హసన్‌పర్తిలో పథకాల కరపత్రాన్ని మహిళకు అందజేస్తున్న సల్మాన్ ఖుర్షీద్ తదితరులు

కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ సభ్యుడు సల్మాన్ ఖుర్షీద్

హన్మకొండ: కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే 6 గ్యారంటీ స్కీమ్‌లు అమలు చేస్తామని ఆ పార్టీ వర్కింగ్ కమిటీ సభ్యుడు సల్మాన్ ఖుర్షీద్ అన్నారు. సోమవారం హనుమకొండలో డీసీసీ అధ్యక్షుడు నాయిని రాజేందర్ రెడ్డి ఆధ్వర్యంలో సంకల్ప యాత్ర చేపట్టారు. రాంనగర్‌లోని బంజార తండాలో ప్రారంభమైన యాత్ర, గోకుల్‌నగర్, వెంకట్రామ్ నగర్, గాంధీనగర్, మీదుగా వాజ్‌పేయి కాలనీ వరకు సాగింది. ఇంటింటికి వెళ్లి ఆరు గ్యారంటీ పథకాలను వివరిస్తూ, కరపత్రాలు పంచారు. వాజ్‌పేయ్ కాలనీలోని స్థానికులతో కలిసి నాయకులు సహపంక్తి భోజనం చేశారు. ఈ సందర్భంగా 50 మంది యువకులు కాంగ్రెస్‌లో చేరారు. ఈ సందర్భంగా సల్మాన్ ఖుర్షీద్ మాట్లాడుతూ కరీంనగర్ బహిరంగ సభలో సోనియా ఇచ్చిన హామీ మేరకు తెలంగాణ రాష్ట్రం ఇచ్చారన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం రాగానే సోనియా ప్రకటించిన గ్యారంటీ స్కీమ్‌లు మహాలక్ష్మి, రైతు భరోసా, గృహజ్యోతి, ఇందిరమ్మ ఇళ్లు, యువ వికాసం, చేయూత కార్యక్రమాలు ఇస్తామన్నారు. కార్యక్రమంలో ఏఐసీసీ కార్యదర్శి రోహిత్ చౌదరి, ఏఐసీసీ అబ్జర్వర్, వరంగల్ పార్లమెంట్ ఇన్‌చార్జ్ రవీంద్ర ఉత్తమ్‌రావు దళ్వీ, పంజాబ్ పీసీసీ అధ్యక్షుడు లక్కి, టీపీసీసీ ఉపాధ్యక్షురాలు బండ్రు శోభారాణి, టీపీసీసీ ప్రచార కమిటీ కన్వినర్ సయ్యద్ అజ్మతుల్లా హుస్సేనీ, మాజీ ఎంపీ సిరిసిల్ల రాజయ్య తదితరులు పాల్గొన్నారు.



చిన్నారితో ముచ్చటిస్తున్న సిడబ్ల్యుసీ సభ్యుడు సల్మాన్ ఖుర్షీద్

బీఆర్‌ఎస్‌కు వీఆర్‌ఎస్ ఇవ్వండి

హసన్‌పర్తి:బీఆర్‌ఎస్ పార్టీకి వీఆర్‌ఎస్ ఇవ్వాలని కాంగ్రెస్ తెలంగాణ ఇన్‌చార్జ్, ఏఐసీసీ కార్యదర్శి రోహిత్ చౌదరి పిలుపునిచ్చారు. ఆరు గ్యారంటీ పథకాలపై సోమవారం హసన్‌పర్తిలో ఇంటింటికి తిరుగుతూ కరపత్రాల ద్వారా ప్రచారం చేపట్టారు. అనంతరం కార్యకర్తలతో కలిసి సహపంక్తి భోజనం చేశారు. కాంగ్రెస్ నియోజకవర్గ కో–ఆర్డినేటర్ నమిండ్ల శ్రీనివాస్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో మాజీ ఎంపీ సిరిసిల్ల రాజయ్య, పీసీసీ సభ్యుడు వరద రాజేశ్వర్‌రావు, కాంగ్రెస్ నాయకులు కేఆర్.నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

శ్రీఉత్తిష్ట గణపతి నవరాత్రి మహోత్సవాలు ప్రారంభం



హన్మకొండ కల్చరల్ : శ్రీరుద్రేశ్వరస్వామి వేయిస్తంభాల దేవాలయంలో వినాయకచవితిని పురస్కరించుకుని శ్రీ ఉత్తిష్ట గణపతి నవరాత్రి మహోత్సవాలను ఘనంగా ప్రారంభించారు. రెండవ రోజు మంగళవారం ఆలయ ప్రధానార్చకులు గంగు ఉపేంద్రశర్మ ఆధ్వర్యంలో గణపతిని శ్రీఉత్తిష్టగణపతిగా పూలదండలతో అలంకరించారు. వేముల సత్యమూర్తి ఆధ్వర్యంలో నిత్యాన్నదానం ప్రారంభించారు. సాయంత్రం నాగమణిచే హరికథా కాలక్షేపం అలరించింది.

కేయూకు ముగిసిన సెలవులు..

- బకాయిలు చెల్లిస్తేనే మెస్ కార్డుల రెన్యూవల్
- ఎస్ఎఫ్‌సీ విద్యార్థులకు హాస్టల్ వసతి

కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీకి ఈనెల 18వ తేదీతో సెలవులు ముగిశాయి. మంగళవారం నుంచి తరగతుల ప్రారంభమయ్యాయి. హాస్టల్ వసతితోపాటు మెస్‌కార్డులు రెన్యూవల్ చేస్తున్నారు. గత విద్యాసంవత్సరంలో హాస్టల్‌వసతి, మెస్‌కార్డులు కలిగిన విద్యార్థులు స్కాలర్‌షిప్‌లు పోనూ మిగతా మెస్ బిల్లుల బకాయిలు చెల్లిస్తేనే మెస్‌కార్డులు జారీ చేస్తున్నట్లు కేయూ హాస్టళ్ల డైరెక్టర్ వెంకయ్య తెలిపారు. పీజీ కోర్సుల రెండో సెమిస్టర్ పూర్తిచేసుకున్న మూడోసెమిస్టర్ల విద్యార్థులకు రెగ్యులర్ కోర్సులతోపాటు, ఎస్ఎఫ్‌సీ విద్యార్థులకు కూడా హాస్టల్ వసతి కల్పించనున్నారు. మంగళవారం వరకు మెస్‌లను రీఓపెన్ చేయలేదు. కనీసం వందం మంది విద్యార్థులు కార్డులు తీసుకుంటే మెస్ ఓపెన్ చేస్తామని డైరెక్టర్ తెలిపారు. బీ ఫార్మసీ మొదటి సంవత్సరంలో ఇటీవల చేరిన విద్యార్థులకు కూడా హాస్టల్ వసతి మెస్‌కార్డులు జారీచేస్తున్నట్లు తెలిపారు.

దరఖాస్తుల ఆహ్వానం

కాశోజీ సెంటర్ : నర్సంపేట, వర్ధన్నపేట, నెక్కొండ వరంగల్‌లో ఉన్న భవిత కేంద్రాల్లో దివ్యాంగ విద్యార్థులకు స్పీచ్ థెరపీ సేవలు అందించేందుకు తాత్కాక ప్రాతిపదికన అర్హుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు వరంగల్ డీఈఓ వాసంతి ఒక ప్రకటనలో తెలిపారు. ప్రతి స్పీచ్ థెరపీ క్యాంపునకు రూ.1000 గౌరవేతనం ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. ఆసక్తి కలిగిన వారు దరఖాస్తులను ఈనెల 23లోపు డీఈఓ కార్యాలయంలో అందజేయాలని సూచించారు.

విద్యుదాఘాతంతో రైతు..

బయ్యారం: విద్యుదాఘాతంతో ఓ రైతు మృతి చెందారు. ఈ ఘటన సోమవారం మండలంలోని నాగారం తండాలో జరిగింది. తండాకు చెందిన అజ్మీరా వీరన్న(27) తన మిర్చి తోటలో దమ్ము చేయడానికి వెళ్లారు. ఈ క్రమంలో వీరన్న ఎత్తుకొస్తున్న ఇనుపగొర్రు.. తోటలో ఉన్న విద్యుత్ స్తంభానికి సపోర్ట్‌గా వేసిన వైరుకు తగిలింది. దీంతో విద్యుత్ సరఫరా అయి వీరన్న అక్కడికక్కడే మృతి చెందారు. మృతుడికి భార్య లలిత, ఇద్దరు పిల్లలున్నారు. ఈ ఘటనపై మృతుడి కుటుంబీకుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై ఉపేందర్ తెలిపారు. కాగా, వీరన్న మృతితో పండుగ (వినాయకచవితి) రోజు తండాలో విషాదం నెలకొంది.

మాట నిలబెట్టుకున్న సోనియాగాంధీ..

- సీడబ్ల్యూసీ సభ్యుడు సల్మాన్ ఖుర్షీద్

హన్మకొండ చౌరస్తా: సోనియాగాంధీ.. తెలంగాణ ప్రజల ఆకాంక్ష అర్థం చేసుకుని రాష్ట్రం ఇచ్చి తన మాట నిలబెట్టుకున్నారని సీడబ్ల్యూసీ సభ్యుడు సల్మాన్ ఖుర్షీద్ అన్నారు. ఈ మేరకు మంగళవారం హనుమకొండలోని కాంగ్రెస్ భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్ అధికారంలోకి రాగానే తెలంగాణ అభ్యున్నతికి ఆరు గ్యారంటీలను పకడ్బందీగా అమలు చేస్తామన్నారు. సోనియాగాంధీ ప్రకటించిన ఆరు గ్యారంటీలను పార్టీ శ్రేణులు ప్రతి ఇంటికీ తీసుకెళ్లాలని సూచించారు. బీఆర్ఎస్ పార్టీ ఎన్నో హామీలు ఇచ్చి అధికారంలోకి రాగానే వంచించిందని, బీజేపీ, బీఆర్ఎస్ రెండు పార్టీలు ప్రజలను మోసం చేశాయని మండిపడ్డారు. బీజేపీ.. సీబీఐ, సీఐడీ, ఈడీ, ఇన్‌కమ్ ట్యాక్స్‌ల పేరుతో ప్రతిపక్షాల గొంతులు నొక్కుతుందని ధ్వజమెత్తారు. ప్రజలు ప్రేమ, ఐకమత్యంతో ఉండాలని రాహుల్‌గాంధీ 'భారత్ జోడో' యాత్ర చేపడితే కుల, మత విద్వేషాలు రెచ్చగొట్టి దేశాన్ని విచ్ఛిన్నం చేస్తోందన్నారు. ఇండియా కూటమితో ప్రధానికి మోదీకి ఓటమి భయం పట్టుకుందని, అందుకే భారత్‌గా పేరు మారుస్తానని అంటున్నారని విరుచుకుపడ్డారు. ఏఐసీసీ కార్యదర్శి రోహిత్ చౌదరి మాట్లాడుతూ రాహుల్‌గాంధీ వరంగల్ రైతు డిక్లరేషన్‌తో తెలంగాణలో కాంగ్రెస్ గ్రాఫ్ పెరిగితే, కాంగ్రెస్ విజయభేరితో మరింత జోష్ పెరిగిందన్నారు. తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం చూడాలనే సోనియాగాంధీ కల నెరవేరబోతుందన్నారు. అందుకు నాయకులు, కార్యకర్తలు అహర్నిషలు కృషి చేయాలన్నారు. తెలంగాణలో బడుగు, బలహీన వర్గాల యువకుల ఆశలు గల్లంతయ్యాయని , కేసీఆర్ కుటుంబం మాత్రం బాగుపడిందన్నారు. బీజేపీ, బీఆర్ఎస్, ఎంఐఎం ఒక్కటేనని, బయట తిట్టుకుంటూ లోపల కలిసి ఉంటారని అన్నారు. కార్యక్రమంలో ఏఐసీసీ పరిశీలకుడు రవీంద్ర ఉత్తమ్ రావు దళ్వి, పంజాబ్ పీసీసీ చీఫ్ లక్కి, టీపీసీసీ ఉపాధ్యక్షురాలు బంద్రు శోభారాణి, హనుమకొండ, వరంగల్ డీసీసీ అధ్యక్షులు నాయిని రాజేందర్‌రెడ్డి, ఎర్రబెల్లి స్వర్ణ, మాజీ మంత్రి కొండా సురేఖ, మాజీ ఎంపీ సిరిసిల్ల రాజయ్య, డీసీసీబీ మాజీ చైర్మన్ జంగా రాఘవరెడ్డి, నాయకులు అజ్మతుల్లా, డాక్టర్ రియాజ్, సాంబయ్య, శ్రీనివాసరావు, ఇనుగాల వెంకట్రాంరెడ్డి, నమిండ్ల శ్రీనివాస్, కత్తి వెంకటస్వామి తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సల్మాన్ ఖుర్షీద్. పక్కన హనుమకొండ, వరంగల్ డీసీసీ అధ్యక్షులు రాజేందర్‌రెడ్డి, స్వర్ణ

ఓటరు నమోదుపై విస్తృతంగా అవగాహన

- హనుమకొండ కలెక్టర్ సిక్తా పట్నాయక్

హన్మకొండ అర్బన్: ఓటరు నమోదులో భాగంగా స్వీప్ కార్యక్రమాల ద్వారా జిల్లావ్యాప్తంగా విస్తృతంగా అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని హనుమకొండ కలెక్టర్ సిక్తా పట్నాయక్ అన్నారు. సోమవారం కలెక్టరేట్‌లో ఓటు హక్కు నమోదులో భాగంగా జిల్లాస్థాయిలో నిర్వహించిన వివిధ రకాల పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు ఆమె బహుమతులు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ 19వ తేదీ ఓటరు నమోదుకు చివరి గడువు అని, జిల్లా వ్యాప్తంగా పలు రకాల కార్యక్రమాలు నిర్వహిస్తూ విస్తృతంగా ప్రచారం చేపడుతున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో వివిధ శాఖ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ముగిసిన ఓటరు నమోదు : కలెక్టర్ ప్రావీణ్య

జిల్లాలో ఓటరు నమోదు కార్యక్రమం మంగళవారం ముగిసిందని కలెక్టర్ ప్రావీణ్య ఒక ప్రకటనలో తెలిపారు. ఓటరు జాబితా సంబంధిత పోలింగ్ కేంద్రాలు, తహసీల్దార్ కార్యాలయాలు, కలెక్టర్ కార్యాలయంలో ప్రదర్శించనున్నట్లు పేర్కొన్నారు. ఓటరు నమోదు కార్యక్రమం ముగిసినా అక్టోబర్ 1 నాటికి 18 ఏళ్లు నిండిన వారు కూడా ఓటరు నమోదుకు దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు.



పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేస్తున్న కలెక్టర్

26 నుంచి ఎంబీఏ సెమిస్టర్ పరీక్షలు

కేయూ క్యాంపస్ : కాకతీయ యూనివర్సిటీ ఎంబీఏ రెండో సెమిస్టర్ ఈనెల 26 నుంచి, నాలుగో సెమిస్టర్ పరీక్షలు ఈనెల 25వ తేదీ నుంచి నిర్వహించనున్నట్లు పరీక్షల నియంత్రణాధికారి ఆచార్య పి మల్లారెడ్డి, అదనపు పరీక్షల నియంత్రణాధికారి డాక్టర్ రాధిక మంగళవారం తెలిపారు. ఎంబీఏ రెండో సెమిస్టర్ పరీక్షలు ఈనెల 26, 29 తేదీల్లో, అక్టోబర్3న, 5, 10, 12వ తేదీల్లో నిర్వహించనున్నామని తెలిపారు. నాలుగో సెమిస్టర్ పరీక్షలు ఈనెల 25, 27, 30వ తేదీల్లో, అక్టోబర్4, 6న, 9న,11వ తేదీల్లో జరగుతాయని తెలిపారు.

23 నుంచి ఎంపీఈడీ నాలుగో సెమిస్టర్ పరీక్షలు

కాకతీయ యూనివర్సిటీ పరిధిలో ఎంపీఈడీ నాలుగో సెమిస్టర్ పరీక్షల టైంటేబుల్‌ను మంగళవారం పరీక్షల విభాగం అధికారులు విడుదల చేశారు. ఈనెల 23, 25, 27 తేదీల్లో నిర్వహిస్తారని తెలిపారు. అలాగే, బీపీఈడీ నాలుగో సెమిస్టర్ పరీక్షలు ఈనెల 23, 25, 27, 29 తేదీల్లో నిర్వహిస్తారు. పూర్తి వివరాలు కేయూ వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచామని పరీక్షల నియంత్రణాధికారి ఆచార్య మల్లారెడ్డి, అదనపు పరీక్షల నియంత్రణాధికారి డాక్టర్ రాధిక తెలిపారు.

ఈ-కేవైసీ నమోదు చేయించుకోవాలి

- జిల్లా పౌర సరఫరాల శాఖ అధికారి కె.చందన్‌కుమార్

ఖిలా వరంగల్ : జిల్లాలోని రేషన్ షాపుల్లో రేషన్ కార్డుదారులు తప్పనిసరిగా ఈ-కేవైసీ నమోదు చేయించుకోవాలని వరంగల్ జిల్లా పౌర సరఫరాల శాఖ అధికారి కె.చందన్‌కుమార్ సూచించారు. ఈ మేరకు మంగళవారం జిల్లా పౌర సరఫరాల శాఖ కార్యాలయంలో ఈ-పాస్ టెక్నీషియన్లతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ప్రభుత్వ మార్గదర్శకాల మేరకు రేషన్‌షాపుల్లో డీలర్లు కార్డుదారులకు తప్పనిసరిగా ఈ-కేవైసీ అప్‌డేట్ చేయించాలని ఆదేశించారు. ఈ-కేవైసీ నమోదు ప్రచారంలో భాగంగా వరంగల్ రామన్నపేటలోని 71వ షాపును డిప్యూటీ తహసీల్దార్ కిరణ్‌కుమార్, మండల అధికారులతో కలిసి డీఎస్ఓ సందర్శించారు. కార్యక్రమంలో డీలర్ చంద్రమౌళి, కార్డుదారులు పాల్గొన్నారు.



ఈ-కేవైసీపై అవగాహన కల్పిస్తున్న డీఎస్ఓ

బీసీలకు చట్ట సభల్లో రిజర్వేషన్లు కల్పించాలి

- బీసీ రాజ్యాధికార సమితి అధ్యక్షుడు దాసు సురేష్

హన్మకొండ: బీసీ వర్గాలకు చట్ట సభల్లో రిజర్వేషన్లు కల్పించిన అనంతరమే మహిళా రిజర్వేషన్ బిల్లు అమలు చేయాలని బీసీ రాజ్యాధికార సమితి అధ్యక్షుడు దాసు సురేష్ డిమాండ్ చేశారు. మంగళవారం హనుమకొండ నక్కలగుట్టలోని హరిత కాకతీయ హోటల్‌లో బీసీ రాజ్యాధికార ఉమ్మడి వరంగల్ జిల్లా సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర కేబినెట్ మహిళా రిజర్వేషన్ బిల్లుకు ఆమోదం తెలిపి పార్లమెంట్‌లో ప్రవేశపెట్టడాన్ని తాము స్వాగతిస్తున్నామన్నారు. బీసీ వర్గాలు, మహిళలకు 33 శాతం రిజర్వేషన్లు ఇవ్వాలని సీఎం కేసీఆర్.. ప్రధానికి లేఖ రాయడం హాస్యాస్పదంగా ఉందని విమర్శించారు. కేసీఆర్ తాను ప్రకటించిన అభ్యర్థుల జాబితాలో బీసీ వర్గాల్లో మహిళా కోటా అమలు చేయకపోవడం వెనుక మతలబేమిటని ప్రశ్నించారు. కేసీఆర్ వెంటనే తాను ప్రకటించిన 115 మంది అభ్యర్థుల జాబితాలో ముందు బీసీ వర్గాల మహిళలకు 33 శాతం టికెట్లు ఇవ్వాలని డిమాండ్ చేశారు. సామాజికంగా ఎస్సీ, ఎస్టీ సామాజిక వర్గాల తర్వాత బీసీ వర్గాలకు చట్టసభల్లో రిజర్వేషన్లు కల్పించిన తర్వాతే వర్టికల్ పద్ధతిలో అన్ని విభాగాల్లో మహిళా రిజర్వేషన్లు అమలు జరగాలన్నారు. అలా కాకుండా కేవలం మహిళా రేజర్వేషన్లను మాత్రమే అమలుపరిస్తే అది రిజర్వేషన్ల మౌలిక సూత్రానికి విరుద్ధమన్నారు. సమావేశంలో భూపాలపల్లి జిల్లా ఇన్‌చార్జ్ చేపూరు ఓదెలు యాదవ్, నాయకులు పాదిలి రాజు, సాయిబాబా, దామరకొండ కొమురయ్య, మడత కిశోర్, చింతం అనిల్, వనం మహేందర్, పైండ్ల భిక్షపతి , గాజు యుగంధర్ యాదవ్, కూరపాటి శ్రీనివాస్ పాల్గొన్నారు



నినాదాలు చేస్తున్న బీసీ రాజ్యాధికార సమితి అధ్యక్షుడు సురేష్, నాయకులు

వీసీ, రిజిస్ట్రార్ల చిత్రపటాలకు పిండప్రదానం

- కేయూలో కొనసాగుతున్న విద్యార్థి జేఏసీ దీక్షలు

కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీలో పీహెచ్‌డీ అడ్మిషన్లకు సంబంధించిన రెండో జాబితా విడుదల చేయాలని, ఈ అడ్మిషన్లలో జరిగిన అవకతవకలపై న్యాయ విచారణ జరిపించాలనే తదితర డిమాండ్లతో 14 రోజుల నుంచి దీక్షలు చేస్తున్నా వీసీ, రిజిస్ట్రార్లు స్పందించకపోవడాన్ని నిరసిస్తూ మంగళవారం దీక్షల శిబిరం వద్ద వారి చిత్రపటాలకు విద్యార్థి జేఏసీ నాయకులు పిండ ప్రదానం చేసి నిరసన తెలిపారు. వంటవార్పు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పోలీసులతో కొట్టించడాన్ని నిరసిస్తూ 14 రోజుల నుంచి దీక్షలు చేస్తున్నా వీసీ, రిజిస్ట్రార్లు స్పందించడం లేదని మండిపడ్డారు. కాగా, మంగళవారం విద్యార్థి జేఏసీ దీక్షలను పార్ట్‌టైం లెక్చరర్ల అసోసియేషన్ అధ్యక్షుడు సొల్లికిరణ్‌గౌడ్ ప్రారంభించారు. కార్యక్రమంలో విద్యార్థి జేఏసీ చైర్మన్ తిరుపతియాదవ్, నేతలు గుగులోత్ రాజునాయక్, మేడరంజిత్‌కుమార్, బొట్లమనోహర్, ఆరెగంటి నాగరాజు, మాచర్ల రాంబాబు, అంబాలకిరణ్, మట్టెడ కుమార్, శంకర్, విజయ్‌కన్నా, మొగిలివెంకటరెడ్డి, ఎండీ పాషా, నిమ్మల రాజేష్, బానోత్ లక్‌పతి, గట్టు ప్రశాంత్, కాయిత నాగరాజు, మంగపెల్లి హుస్సేన్ తదితరులు పాల్గొన్నారు.



వీసీ, రిజిస్ట్రార్ల చిత్రపటాలకు పిండ ప్రదానం చేస్తున్న విద్యార్థులు

పీహెచ్‌డీ ప్రవేశాలు పారదర్శకం

- అన్ని విభాగాల డీన్ల వెల్లడి

కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీలో పీహెచ్‌డీ రెండో కేటగిరీ ప్రవేశాలు పారదర్శకంగా నిర్వహించామని, ప్రవేశ పరీక్షల ఫలితాలు కూడా వెల్లడించి కేయూ వెబ్‌సైట్‌లోనే అప్‌లోడ్ చేశామని ఆర్ట్స్, సైన్స్, సోషల్‌సైన్స్, లా, విద్య, ఇంజనీరింగ్, లా, కామర్స్ అండ్ బిజినెస్ మేనేజ్‌మెంట్, ఫార్మసీ విభాగాల డీన్‌లు బన్నఅయిలయ్య, మనోహర్, విజయలక్ష్మి, మల్లారెడ్డి, రాంనాథ్‌కిషన్, శ్రీనివాసులు, అమరవేణి, నర్సింహారెడ్డి మంగళవారం రాత్రి ఒక సంయుక్త ప్రకటనలో తెలిపారు. పీహెచ్‌డీ రెండో కేటగిరీలో అడ్మిషన్లు నిష్పక్షపాతంగా చేశామన్నారు. ఏమైనా అభ్యంతరాలు ఉంటే విజ్ఞాపన పత్రంతో డీన్లకు సమర్పించాలన్నారు. ఎక్కడైనా తప్పుదొర్లితే ఆ తప్పును సవరించేందుకు డీన్ల వద్ద ఉన్న సమాచారాన్ని పున:పరిశీలించి పరిష్కరించే అవకాశం ఉంటుందన్నారు. పీహెచ్‌డీ రెండో కేటగిరీ అడ్మిషన్లపై కొద్దిరోజులుగా కొంతమంది సీటు రాని విద్యార్థి నాయకులు ఆందోళనలు చేయడం, అధికారులపై ఒత్తిడి తీసుకురావడం, డీన్ పదవికి రాజీనామ చేయాలని ఫోన్ల ద్వారా అధికారులను భయభ్రాంతులకు గురిచేశారని ఆరోపించారు. యూనివర్సిటీ ఆస్తులు ధ్వంసం చేశారని పేర్కొన్నారు. విద్యార్థి నాయకుల చేష్టలను ముక్తకంఠంతో ఖండిస్తున్నామని ఆ ప్రకటనలో పేర్కొన్నారు. విశ్వవిద్యాలయంలో విద్యా వాతావరణాన్ని దెబ్బతీస్తున్న వారికి మద్దతు ఇవ్వడం శోచనీయమన్నారు.

ఎమ్మార్పీకే ఎరువులు విక్రయించాలి

- వరంగల్ కలెక్టర్ ప్రావీణ్య

ఖిలా వరంగల్ : ఎమ్మార్పీకే ఈపాస్ ద్వారా ఎరువులు విక్రయించాలని వరంగల్ కలెక్టర్ ప్రావీణ్య ఆదేశించారు. ఖిలా వరంగల్ మండల పరిధిలోని పీఏసీఎస్, ఫర్టిలైజర్స్, పెస్టిసైడ్స్, సీడ్స్‌షాపులను జిల్లా వ్యవసాయ శాఖ అధికారి ఉషాదయాళ్‌తో కలిసి మంగళవారం కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. రిజిస్టర్లు, రైతులకు విక్రయిస్తున్న తీరును ఆమె పరిశీలించారు.

ఎన్‌సీసీతో క్రమశిక్షణ, దేశభక్తి

మామునూరు : దేశానికి యువతే బలమని, ఎన్‌సీసీ శిక్షణ పొందిన కేడెట్లకు ఏ, బీ, సీ సర్టిఫికెట్లతో ఉజ్వల భవిష్యత్ ఉంటుందని, క్రమశిక్షణ, సామాజిక సేవ, దేశభక్తి మరింత పెంపొందుతుందని వరంగల్ కలెక్టర్ ప్రావీణ్య అన్నారు. మామునూరులోని పీటీసీ ప్రాంగణంలో ఎన్‌సీసీ 10వ బెటాలియన్ వరంగల్ క్యాంపు కమాండెంట్ కల్నల్ అజయ్‌నంద కందూరి, గ్రూప్ కమాండెంట్ కల్నల్ సచిన్ నింబాల్కర్ వీరచక్ర పర్యవేక్షణలో ప్రారంభమైన ఎన్‌సీసీ శిక్షణ క్యాంపు మంగళవారం ముగిసింది. ముఖ్య అతిథిగా కలెక్టర్ ప్రావీణ్య హాజరై మాట్లాడారు. కార్యక్రమంలో పీటీసీ ప్రిన్సిపాల్ ఇంజారపు పూజ, వైస్ ప్రిన్సిపాల్ శ్రీనివాస్‌రావు, కెప్టెన్ సతీష్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.



వరంగల్ ఫోర్ట్‌రోడ్డులోని ఫర్టిలైజర్స్, పెస్టిసైడ్స్ దుకాణంలో రికార్డులను పరిశీలిస్తున్న కలెక్టర్

కార్మికులు హక్కుల కోసం ఉద్యమించాలి



వేదికపై రైల్వే అధికారులు, రైల్వే ఎస్సీ, ఎస్టీ నాయకులు

కాజీపేట రూరల్: రైల్వే ఎస్సీ, ఎస్టీ కార్మికులు తమ హక్కుల సాధన కోసం ఉద్యమించాలని ఆలిండియా ఎస్సీ, ఎస్టీ రైల్వే ఎంప్లాయిస్ అసోసియేషన్ సికింద్రాబాద్ డివిజన్ ప్రెసిడెంట్ బి. వీరన్న అన్నారు. కాజీపేట రైల్వే ఎస్సీ, ఎస్టీ ఎంప్లాయిస్ కార్యాలయంలో మంగళవారం అసోసియేషన్ 65వ ఆవిర్భావ దినోత్సవం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సికింద్రాబాద్ డివిజన్ పరిధిలో రైల్వే ఎస్సీ, ఎస్టీ కార్మికులు ఐక్యంగా ఉండి హక్కుల సాధనకు కృషి చేయాలన్నారు. ఎస్సీ, ఎస్టీ ఏడీఎస్ కెఎస్.రావు మాట్లాడుతూ సికింద్రాబాద్ డివిజన్ సెక్రటరీ ఎ.ఆర్.రాజశేఖర్ సూచనల మేరకు కాజీపేట జంక్షన్‌లో అన్ని బ్రాంచీల నాయకులు కలిసి అసోసియేషన్ ఆవిర్భావ దినోత్సవం జరుపుకోవడం సంతోషంగా ఉందన్నారు. రైల్వే ఆస్పత్రి డీఎంఓ ధీరజ్‌కుమార్ మాట్లాడుతూ రైల్వే ఎస్సీ, ఎస్టీ కార్మికుల అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానన్నారు. రైల్వే అధికారులు బి.బాలరాజు, ఆర్.వి.వెంకటేశ్వర్లు, రామారావు, సురమౌలేశ్వర్ రావు ఎస్సీ, ఎస్టీల అభివృద్ధిపై మాట్లాడారు. కార్యక్రమంలో కె.రవీందర్, చింత తిరుపతి, శ్రీనివాస్‌నాయక్, సీనుబాబు, వీరస్వామి, ఎం.ఎల్.నారాయణ, ఆర్.కుమారస్వామి, కిషన్, జెగ్దారావు, ప్రవీణ్, ఎం.శ్రీను, ఎం.నరేష్, ఎం.మోహన్, రామ్మూర్తి, జక్రియా, మీనాలు, కె.సంగమయ్య, కె.వి.రావు, కొండ్ర నర్సింగరావు పాల్గొన్నారు.

22న ఉద్యోగమేళా

కాశోజీ సెంటర్ : ములుగు రోడ్డు సమీపంలోని ప్రభుత్వ ఐటీఐ క్యాంపస్‌లో ఉన్న వరంగల్ జిల్లా ఉపాధి కార్యాలయంలో ఈనెల 22న ఉద్యోగ మేళా నిర్వహిస్తునట్లు జిల్లా ఉపాధి అధికారి ఎస్.మాధవి ఒక ప్రకటనలో తెలిపారు. హనుమకొండలోని ఫ్లిప్‌కార్ట్ కంపెనీలో పనిచేసేందుకు 30 మందిని ఎంపిక చేయనున్నట్లు పేర్కొన్నారు. అభ్యర్థులు పదో తరగతి చదివి, 18 సంవత్సరాల నుంచి 40 సంవత్సరాల వయస్సు ఉండాలని తెలిపారు. ఎంపికైన వారికి రూ. 18,000 నుంచి రూ.20,000 వేతనం ఇస్తారని పేర్కొన్నారు. వివరాలకు 7799314685 నంబర్‌లో సంప్రదించవచ్చునని ఆమె సూచించారు.

చైన్ స్నాచింగ్‌కు పాల్పడిన ముఠా అరెస్ట్

- మూడున్నర తులాల బంగారు పుస్తెల తాడు స్వాధీనం

భువనగిరి : చైన్ స్నాచింగ్‌కు పాల్పడిన ముఠాను భువనగిరి పోలీసులు అరెస్ట్ చేశారు. మంగళవారం తన కార్యాలయంలో భువనగిరి డీసీపీ రాజేష్‌చంద్ర నిందితులను మీడియా ఎదుట ప్రవేశపెట్టి కేసు వివరాలు వెల్లడించారు. వరంగల్ జిల్లాకు చెందిన బోగి గణేష్, వరంగంటి నవీన్, దేవర రమేష్, బోగి నరేష్ ఫైనాన్స్ వ్యాపారం చేసేవారు. వ్యాపారంలో నష్టం రావడంతో హైదరాబాద్‌కు వెళ్లి ఏదో ఒక పని చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. వచ్చే డబ్బుతో అవసరాలు తీరకపోవడంతో సులభంగా డబ్బు సంపాదించేందుకు చోరీలు చేయాలని నిర్ణయించుకున్నారు. ఇందులో భాగంగా ఈ నెల 2వ తేదీన నలుగురు లాంగ్ డ్రైవ్ యాప్‌లో నంబర్‌లేని కారును బుక్ చేసుకున్నారు. ఆ కారులో హైదరాబాద్ నుంచి వరంగల్‌కు వెళ్తూ మార్గమధ్యలో ముందుగా వెళ్తున్న కారు నంబర్‌ను నోట్ చేసుకున్నారు. అనంతరం ఆ నంబర్ గల ప్లేట్‌ను తయారు చేయించుకుని తమ అద్దెకారుకు ఏర్పాటు చేసుకున్నారు. 3వ తేదీన ఉదయం 5గంటలకు వరంగల్ నుంచి జఫర్‌గఢ్, తిరుమలగిరి మీదుగా హైదరాబాద్‌కు బయలుదేరారు. వలిగొండ మండలం వర్కట్‌పల్లి గ్రామ శివారుకు చేరుకోగానే రోడ్డు మీదుగా ఒంటరిగా నడుచుకుంటూ వెళ్తున్న మహిళను బెదిరించి మెడలో ఉన్న మూడున్నర తులాల బంగారు పుస్తెల తాడు తీసుకుని, వాటికి ఉన్న రెండు పుస్తెలను ఆమెకి ఇచ్చి అక్కడి నుంచి పారిపోయారు. బాధిత మహిళ వలిగొండ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా పోలీసులు దర్యాప్తు చేపట్టారు. ముఠా సభ్యులు మంగళవారం ఉదయం 5 గంటల సమయంలో చైన్ స్నాచింగ్ పాల్పడేందుకు మేడిపల్లిలోని లాంగ్‌డ్రైవ్ సెంటర్‌కి వెళ్లి కారు అద్దెకు తీసుకున్నారు. చిట్యాలకు వెళ్తుండగా వలిగొండ మండలం నాగారం గ్రామం వద్ద పోలీసుల వాహనాల తనిఖీలో అనుమానం వచ్చి అదుపులోకి తీసుకుని విచారించగా నేరం అంగీకరించారు. వారి వద్ద నుంచి 33గ్రాముల పుస్తెలతాడు, 5 మొబైల్ ఫోన్లు, కారు స్వాధీనం చేసుకుని రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు. సమావేశంలో అడిషనల్ డీసీపీ రవికుమార్, చౌటుప్పల్ ఏసీపీ మొగులయ్య, రామన్నపేట సీఐ మోతీరాం, వలిగొండ ఎస్సై ప్రభాకర్, సిబ్బంది పాల్గొన్నారు.



వివరాలు వెల్లడిస్తున్న డీసీపీ రాజేష్ చంద్ర

ఇంజక్షన్ వికటించి.. రిటైర్డ్ కానిస్టేబుల్ మృతి

- పోలీస్‌స్టేషన్‌లో బాధితుల ఫిర్యాదు.. కేసు నమోదు
- డిప్యూటీ డీఎంహెచ్‌ఓ విచారణ
- ఆస్పత్రిలో కాలం చెల్లిన మందులు, ఇంజక్షన్లు
- నిబంధనలకు విరుద్ధంగా నిర్వహణ



సారయ్య (ఫైల్)

హసన్‌పర్తి: ఇంజక్షన్ వికటించి ఓ రిటైర్డ్ కానిస్టేబుల్ మృతి చెందారు. ఈ ఘటన హసన్‌పర్తి మండల కేంద్రంలో జరిగింది. చింతగట్టుకు చెందిన రిటైర్డ్ కానిస్టేబుల్ నద్దునూరి సారయ్య (65) చికిత్స నిమిత్తం సోమవారం మండల కేంద్రంలోని 'శంకర్' ఆస్పత్రికి వచ్చారు. ఈ సందర్భంగా డాక్టర్ శంకర్.. సారయ్యకు వైద్య పరీక్షలు నిర్వహించారు. అనంతరం రెండు ఇంజక్షన్లు ఇవ్వగా సారయ్య ఒకసారిగా కుప్పకూలారు. దీంతో సారయ్యను 108లో ఎంజీఎం ఆస్పత్రికి తరలించారు.



విచారణ చేపడుతున్న డిప్యూటీ డీఎంహెచ్‌ఓ

ప్రిస్కిప్షన్ ఇవ్వమని..

ఇదిలా ఉండగా సారయ్యకు ప్రథమ చికిత్స సందర్భంగా ఉపయోగించిన మందుల ప్రిస్కిప్షన్ ఇవ్వాలని 108 సిబ్బంది.. వైద్యుడి శంకర్‌ను కోరారు. అయితే అప్పటికే అక్కడికి చేరుకున్న మృతుడి కుమారులు ఆగ్రహం వ్యక్తం చేస్తూ డాక్టర్ శంకర్‌పై దాడికి దిగారు. అనంతరం డాక్టర్ శంకర్‌ను అంబులెన్స్‌లో ఎంజీఎంకు తీసుకెళ్లారు. కాగా, ఎంజీఎంలో సారయ్యను పరీక్షించిన వైద్యులు.. అతను మృతి చెందినట్లు నిర్ధారించారు. అయితే సారయ్యకు పరీక్షలు నిర్వహిస్తున్న క్రమంలో వైద్యుడు శంకర్ అక్కడి నుంచి పరారయ్యారు. ఈ ఘటనపై సారయ్య కుమారుడు రాజేంద్రప్రసాద్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ గోపి తెలిపారు.

జిల్లా వైద్యాధికారుల విచారణ

ఇంజక్షన్ వికటించి మృతి చెందిన ఘటనపై డిప్యూటీ డీఎంహెచ్‌ఓ మధన్‌మోహన్, సీఐ గోపి విచారణ చేపట్టారు. ఆస్పత్రికి వచ్చి వివరాలు సేకరించారు. సారయ్యకు ఇచ్చిన ఇంజక్షన్‌పై ఆరా దీశారు. అనంతరం ఆస్పత్రిలోని వివిధ విభాగాలను పరిశీలించారు.ఈ సందర్భంగా కాలం చెల్లిన ఇంజక్షన్లు, మందులు గుర్తించారు.

నిబంధనలకు విరుద్ధంగా ఆస్పత్రి నిర్వహణ

ఆస్పత్రి నిర్వహణ నిబంధనలకు విరుద్ధంగా చేపడుతున్నారని డిప్యూటీ డీఎంహెచ్‌ఓ మధన్‌మోహన్ తెలిపారు. విచారణ అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఐదునెలల క్రితం ఇంజక్షన్ వికటించి ఓ బాలుడు మృతి చెందడంతో ఆస్పత్రి సీజ్ చేసినట్లు తెలిపారు. ఓ వైపు విచారణ కొనసాగుతుండగానే అక్రమంగా ఆస్పత్రి నిర్వహిస్తున్నారని చెప్పారు. కాగా, ఐదు నెలల క్రితం ఆస్పత్రి సీజ్ చేసినా సేవలు కొనసాగిస్తున్న డాక్టర్ శంకర్‌పై ఫిర్యాదు చేసినట్లు తెలిపారు.

ఆస్పత్రి సీజ్

'శంకర్' ఆస్పత్రిని సీజ్ చేశారు. తహసీల్దార్ ప్రసాద్, డీటీ రహీం, ఆర్ఏ ప్రణయ్.. ఆస్పత్రికి సీల్ వేశారు. వైద్యాధికారులు వాణిశ్రీ, విజమ్‌రావు, ఏఎస్‌వో ప్రసన్నకుమార్, హెల్త్ అసిస్టెంట్లు కందుకూరి సంతోష్‌కుమార్, ఇంద్రారెడ్డి పాల్గొన్నారు.

సాక్షి క్లాసిఫైడ్స్

REAL ESTATE

HOUSE FOR SALE

వరంగల్, మట్టెవాడలోని రేకులపల్లి వాడలో తూర్పు ముఖముతో గల పాత ఇల్లు 113 Sq. yards పక్కా రిజిస్ట్రేషన్ గలది అమ్మకమునకు కలదు. సంప్ర॥ 8331888842. [W-1229426]

SERVICES

హౌసింగ్, బిజినెస్, పర్సనల్, మార్టిగేజ్ & ఉద్యోగస్తులందరికి పర్సనల్ రుణాలు ఏ బ్యాంకులలో అయినా ఇప్పించబడును & IT Returns, GST License చేయబడును. పద్మావతి ఫైనాన్స్-WGL 9618767116 [W-1229404]

CHANGE OF NAME

I Mohmmed Imamuddin, S/o. Nauroddin Mohmmed and my wife's name, Ashraf Begm Mohammed, as for my passport No. X7136616, R/o. H.No. 2-7-145, Busstand Road, Jangaon Town and Mandal, Jangaon District, My Name and my wife's Name, my father's name, IMAMUDDIN MOHAMMED, NOORUDDIN, and ASHRUF SULTHANA as per my Adhar card (New Names) for all future purpose. [W-1229431]

WANTED

కార్ డ్రైవర్ అర్జెంటుగా కావలెను. లైసెన్స్ కల్గి ఉండి అనుభవం గల డ్రైవర్ కావలెను. జీతం: 10 వేల వరకు ఇవ్వబడును. వివరాలకు వెంటనే సంప్ర॥ 9618569796. [W-1229428]

వరంగల్, హనుమకొండ, మహబూబాబాద్ ఉప్పలపల్లిలలో కలెక్షన్ ఏజెంట్లు కావలెను. ఆకర్షణీయమైన జీతం+ఇన్సెంటీవ్ కలదు. సంప్ర॥ 8331817736, 8179785816. [W-1229425]

అరేపల్లిలోని హాస్పిటల్స్‌లో పనిచేయుటకు సెక్యూరిటీ గార్డ్స్, హౌస్ కీపింగ్, వార్డ్ బాయ్స్, ఆయాలు అర్జెంటుగా కావలెను. 6గం॥ 8గం॥ 12 గం॥ డ్యూటీలు కలవు. జీతం: 8000-12500/- సంప్ర॥ 9000468428. [W-1002398]

శ్రీవైష్ణవి లేడిస్ టైలర్స్‌లో పనిచేయుటకు వర్కర్స్ కావలెను. నెహ్రూ పార్క్ దగ్గర, స్టేషన్ రోడ్, జనగామ. సెల్: 8096302961. [W-1220758]

స్టార్ హోమ్‌కేర్ HYD వృద్ధులకు, పెషేంట్లకు సేవ చేయుటకు, బేబికేర్ ఇంటి/వంట పనికి ఫ్రీ/పు కావలెను. జీతం : 16,000/- నుండి 35,000/- రూం + భోజనం ఉచితం. ఫోన్: 94904 82881 [V-797355]

మీ ఇంటి వద్దనే వుండి మీ మొబైల్ ద్వారా మా కంపెనీ యొక్క Message పంపుతూ వారానికి 3500/- సంపాదించుకోండి. వాట్సాప్ చేయండి. సంప్ర. 9573633520, 9059633520. [M-1221709]

Google Geo కంపెనీలోవరంగల్ పరిసర ప్రాంతవాసులకు ఇంటి వద్దనే వుండి స్మార్ట్ ఫోన్, Laptop కలిగిన అభ్యర్థులు కావలెను. జీతం: 20 వేలు, సంప్ర. 73962 71306 [M-1221550]

ప్రముఖ కంపెనీ యొక్క రికార్డ్స్ వ్రాసినందుకు వారం వారం అధిక ఆదాయం పొందండి. వివరాలకు ఫోన్ చేయండి. ఫోన్: 7730899503 [G-1122]

బాలాజీ హోం కేర్ సర్వీస్ (డీలక్స్) VJA, HYD. శ్రీమంతుల ఇళ్ళలో ముసలివారికి సేవ చేయుటకు ఇంటి/వంట పని, బేబీకేర్ కొరకు 10th P/F, 19-30 సం. వర్కర్స్/నర్సులు కావలెను భో+ వ+ జీ. 18 to 21 వేలు. ఏజెంట్లకు కమీషన్ 5 వేలు. ✆ 94413 81678, 94413 82678 [B-1068108]

మా ఆఫీసు న్యూ ఫ్రాంచేజీ ద్వారా మీ ఖాళీ సమయంతో పార్ట్ టైమ్ / ఫుల్ టైం వర్క్ చేస్తూ 15వేలు ఆపైన సంపాదించే అవకాశం. 9177736926 [G-751693]

మీరు ఉన్నచోట నుండి డిజిటల్‌గా వర్క్ చేస్తూ ప్రముఖ గ్లోబల్ కంపెనీలో నెలకు 35,000/- వరకు సంపాదించవచ్చు. పార్ట్/ ఫుల్ టైం. ఎటువంటి ఫీజులు లేవు. ఫోన్: 85001 48297. [V-797408]

4 లైన్ల క్లాసిఫైడ్ ప్రకటన 260/- రూ॥ అదనపు లైను 60/- రూ॥ మాత్రమే 5% GST అదనము

ఈ సెక్షన్‌లో ప్రకటనల కొరకై సంప్రదించండి

హన్మకొండ	9010144453
వరంగల్	9705748198
నర్సంపేట	9010144453
జనగామ	9951602871
మహబూబాబాద్	9010144453
పరకాల	9010299096
జయశంకర్ భూపాలపల్లి	9705748198

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజు ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.